అంతా రెడీమేడే

- రాత్రికి రాత్రి వెలుస్తున్న వినాయక పందిళ్లు
- వ్యాపారాలు సాగక విలవిల్లాడుతున్న వుడ్ దుకాణదారులు
- నియోజకవర్గంలో వందలాది మండపాల ఏర్పాటు



ఇలాంటి పందిరి వేయడానికి సుమారు పది రోజులు పట్టేది..



ఒక్క రోజులోనే సిద్ధమయ్యే రెడీమేడ్ పందిరి

డాబాగార్డెన్స్ : వినాయక చవితి పండగంటే చిన్నారుల నుంచి పెద్దవారి వరకు సందడే సందడి. నెల రోజులు ముందుగానే యువకులు.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పందిళ్ల ఏర్పాటుకు సిద్ధపడతారు. పందిరి రాట వేసిన దగ్గరి నుంచి నిమజ్జనం వరకు బిజీబిజీగా గడుపుతారు. నవరాత్రుల రోజుల్లో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పందిళ్ల వద్దే కాలం గడుపుతుంటారు. ఇదిలా ఉండగా.. గతంలో పందిరి వేయడానికి అష్టకష్టాలు పడేవారు. వారం, పది రోజుల ముందుగానే ముహూర్తపు రాట వేసేవారు. పెద్ద విగ్రహాలు నిలిపే వారు నెల రోజులు ముందుగానే పందిరి రాట వేసేవారు. అప్పటి నుంచి పందిళ్ల ఏర్పాటు.. డెకరేషన్ కోసం వుడ్ (కర్రలు) దుకాణాల చుట్టూ తిరిగేవారు. ఆ రోజులు పోయాయి. రెడీమేడ్ పందిళ్లు వచ్చేసాయి. వినాయక చవితి రేపు అనగా ముందు రోజు రాట వేయడం.. ఆ రోజు రాత్రికి రాత్రే మండపాలు (రెడీమేడ్) వెలిసే రోజులు వచ్చాయి.

నియోజకవర్గ పరిధిలో..

దక్షిణ నియోజకవర్గం పరిధిలో సుమారు 250 నుంచి 300 వరకు వినాయక మండపాలు వెలుస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాల్లో శతశాతం మండపాలు బుధవారం వరకు ఏర్పాటు కాలేదు. అందుకు ప్రధాన కారణం.. రెడీమేడ్ మండపాలే. ఎక్కడ చూసినా రెడీమేడ్ మండపాలు ఏర్పాటు చేస్తుండడంతో వుడ్ దుకాణాలు వెలవెలబోతున్నాయి.

నిత్యం బిజీబిజీగా..

నిత్యం బిజీగా ఉండే యువకులకు రెడీమేడ్ మండపాలు వచ్చేయడంతో కొంత ఉపశమనం కలిగినట్టయింది. రెడీమేడ్ మండపాలు వెలుస్తుండడంతో.. ఐరన్ రాడ్లు.. వెల్డింగ్ పనివారికి పని దొరికినట్టయింది. ఫలితంగా వారం పది రోజులుగా రాత్రింబవళ్లు పందిళ్లు వేసుకునే యువకులు, స్వచ్ఛంద సంస్థలకు పనిభారం తగ్గింది.

వెలవెలబోతున్న వుడ్ దుకాణాలు..

ఐరన్ రాడ్లతో మండపాలు ఏర్పాటు చేస్తుండడంతో కర్రల (వుడ్) దుకాణాలు వెలవెలబోతున్నాయి. వినాయక చవితి పక్షం రోజులు ముందుగానే (ముహూర్తపు రాట వేసిన దగ్గరి నుంచి) వుడ్ దుకాణాల చుట్టూ తిరిగేవారు. వారికి కావల్సిన సైజులో సరుగుడు రాట్లను కోయించుకునేవారు. అందుకోసం ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు ఆయా దుకాణాల వద్దే ఉండిపోయేవారు. ఒక్కో సరుగుడు పోస్ట్ (సైజ్‌ను బట్టి) రూ. 150 నుంచి రూ. 300కు కొనుగోలు చేసేవారు. 5 అడుగుల నుంచి 12..18 అడుగుల పోస్ట్ వరకు కొనుగోలు చేసేవారు.



వ్యాపారం సాగక వెలవెలబోతున్న సరుగుడు కర్రల దుకాణం

రోజులు మారాయి..

సరుగుడు కర్రలు.. మామూలు కర్రలు (వుడ్)తో వేసే మండపాలకు చాలా మంది స్వస్తి పలికారు. ఇదంతా ఖర్చు, శ్రమతో కూడుకున్న వ్యవహారంగా మారటమే ఇందుకు కారణం. రాటలు.. కర్రలు దిగ్గొట్టేందుకు ఇనుప మేకులు, కొబ్బరి తాళ్లు వినియోగించేవారు. మరీ ముఖ్యంగా పందిరి వేయడానికి మూడు అడుగుల లోతులో గోతులు తవ్వేవారు. పందిరంతా పూర్తయ్యేసరికి సుమారు 10 రోజులు పట్టేది. రోజులు మారాయి. వుడ్ పందిళ్లకు స్వస్తి పలికారు. రెడీమేడ్ పందిళ్లకు క్యూ కడుతున్నారు. ఎటువంటి ఇబ్బందులు.. కష్టాలు పడకుండానే సింపుల్‌గా పందిళ్లు వేసేస్తున్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుకు కొత్త పింఛన్ అందజేస్తున్న రంథి గోపి తదితరులు

అల్లిపురం : ఈ నెల కొత్త వైఎస్సార్ పింఛన్ల పంపిణీ జోరుగా కొనసాగుతోంది. దీంట్లో భాగంగా జీవీఎంసీ 33వ వార్డు పరిధి వేంకటేశ్వరమెట్ట–1 పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేశారు. షేక్‌మీరా అనే మహిళకు వృద్ధాప్య పింఛన్, కారి దేవి అనే మహిళకు వితంతు పింఛను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ వలంటీర్లు తమ వద్దకు వచ్చి దరఖాస్తు తీసుకున్న దగ్గర నుంచి పింఛన్ మంజూరయ్యే వరకు దగ్గరుండి అన్ని పనులు వారే జరిపించారన్నారు. తమకు ఎటువంటి కష్టం కలిగించకుండా పింఛన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన సీఎం జగన్‌కు, వలంటీర్లకు, కార్యదర్శులకు ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎడ్మిన్ భార్గవ్, కార్యదర్శులు కృష్ణకుమారి, రమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వారి వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

28వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు..

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం 28వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

గోతిని పూడ్చరూ..

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు జనతా బజార్ వద్ద ఓ యూజీడీ గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మురుగు పొంగి ఇక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉదయం పోర్టుకు వెళ్లే ఉద్యోగులు, చేపల బజార్, ఫ్రూట్‌మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే గొయ్యి పూడ్చాలని కోరుతున్నారు.



జనతా బాజర్ వద్ద ఏర్పడ్డ గొయ్యి

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం భక్తిపూర్వకంగా జరిపారు. ఈ కార్యక్రమానికి దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎస్‌ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూబజారు తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వయంగా పసుపునీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని పసుపు, కుంకుమ, పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

చిన్నారి మెడలో బంగారు చైన్ అపహరణ

అల్లిపురం : పుట్టిన రోజు వేడుకలో చిన్నారి మెడలో బంగారు చైన్ అపహరించిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. క్రైం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కంచేరపాలెంలోని ఊర్వశి జంక్షన్ ప్రాంతానికి చెందిన బొడ్డేటి ఆనంద్ కుమార్తె పుట్టిన రోజు వేడుకను డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఆనంద్ సోదరుడు బొడ్డేటి ప్రసాద్ తన భార్య, నాలుగున్నర సంవత్సరాల కుమారుడితో వెళ్లారు. ఫంక్షన్‌లో భోజనాల తర్వాత ఫొటోగ్రాఫర్ వాష్‌రూమ్‌కు వెళ్లగా బాత్రూంలో నుంచి చిన్న పిల్లాడి అరుపులు వినిపించాయి. దీంతో తలుపు తీసి అతను చూడగా.. ప్రసాద్ కొడుకు అక్కడ ఏడుస్తూ కనిపించాడు. అతన్ని ఫొటోగ్రాఫర్ వారి తల్లిదండ్రులకు అప్పగించాడు. అయితే బాలుని మెడలో గల సుమారు 2 తులాల బంగారు చైన్ కనిపించలేదు. దీంతో అబ్బాయిని అడగ్గా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తనను బాత్రూమ్‌కు తీసుకెళ్లి చైన్ తీసుకున్నాడని, తనను లోపల పెట్టి తలుపు వేసి వెళ్లిపోయాడని చెప్పాడు. దాంతో బాధితులు టూటౌన్ క్రైం పోలీసులకు సమాచారం అందజేశారు. వారి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.



హోటల్ సెల్లార్‌లో సెక్యూరిటీ గార్డుతో మాట్లాడుతున్న అనుమానిత వ్యక్తి

అంబరాన్నంటిన జానపద సంబరాలు

సీతంపేట: నవచైతన్య కళానాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన జానపద సంబరాలు అంబరాన్నంటాయి. కళాకారులు ప్రదర్శించిన వివిధ జానపద అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి, కొణతాల రాజు, ఎం.వి.రాజశేఖర్, బాదంగీర్ సాయి, సిహెచ్. సత్యనారాయణ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ కానపద కళలను నమ్ముకుంటూ జీవిస్తున్న కళాకారులను ఆదరించాలన్నారు. దేశ సంప్రదాయానికి ప్రతీకగా జానపద కళలు నిలిచాయన్నారు. జానపద కళారూపాలతో సమావేశ ప్రాంగణంలో సందడి నెలకొంది.

'తెలుగు భేరి' విలువైన గ్రంథం

సీతంపేట: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పే విలువైన గ్రంథం తెలుగు భేరి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ప్రిజమ్ కళాశాలలో తెలుగుదండు వ్యవస్థాపకుడు పరవస్తు ఫణిశయన సూరి రచించిన 'తెలుగు భేరి' గ్రంథావిష్కరణ జరిగింది. డి.వి.సూర్యారావు, పరవస్తు ఫణిశయన సూరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో కార్మికులకు ఖాకీ చొక్కాల పంపిణీ



ఆటో కార్మికులకు ఖాకీ చొక్కాలు అందజేస్తున్న నవీన్‌కుమార్

డాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో జీవీఎంసీ 31వ వార్డు నాయకుడు బత్తిన నవీన్ కుమార్ బుధవారం జగదాంబ జంక్షన్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద గల ఆటో స్టాండ్ కార్మికులకు డ్రైవర్ యూనిఫాం (ఖాకీ చొక్కాలు) అందజేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న మురళి

డాబాగార్డెన్స్ : రోడ్డుపై అనారోగ్యంతో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని కొందరి సమాచారం మేరకు 108 వాహనం ద్వారా ఈ నెల 11న కేజీహెచ్‌కి తరలించారు. ఆ వ్యక్తికి నా అనే వారు లేరు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంవో రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం అందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై. శివనాగేంద్రరెడ్డి, కార్యదర్శి రవికుమార్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ నైట్ షెల్టర్ మేనేజర్ మురళి ఆ అనాథ శవానికి కాన్వెంట్ జంక్షన్‌లో గల హిందూ శ్మశాన వాటికలో అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రరావు

డాబాగార్డెన్స్ : నియోజకవర్గ పరిధి లక్ష్మీటాకీస్ సమీపాన గల ఎంవీడీఎం హైస్కూల్లో బుధవారం బాల బాలికల మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్‌ను ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రరావు, జీవీఎంసీ ప్రకాశరావుపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎంవీడీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, పీడీలు ప్రసన్న, నారాయణరావు తదితరులు ప్రారంభించారు. వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించి టీమ్‌ను ఎంపిక చేశారు.

5న సన్‌షైన్ ఓవర్సీస్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్ : సన్‌షైన్ ఓవర్సీస్ వెబ్‌సైట్ ఆవిష్కరణ అక్టోబర్ 5న నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. శృతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏయూ వైస్ చాన్స్‌లర్ పీజీవీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమల్, వాసు, బల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అరెస్ట్

సీతమ్మధార : టీడీపీ నేత చంద్రబాబునాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన దీక్షలు చేపట్టేందుకు వచ్చారు. అయితే వారి నిరసన కార్యక్రమానికి ఎటువంటి అనుమతి లేదని పోలీసులు అరెస్టు చేశారు.

జీవో 21 రద్దు కోరుతూ నిరసన

డాబాగార్డెన్స్ : ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారం మోపే జీవో 21 వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఆటో డ్రైవర్లపై రవాణా శాఖ అధికారులు పెడుతున్న అక్రమ కేసులు, అధిక జరిమానాలు వెంటనే ఆపాలంటూ డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఆటోడ్రైవర్లపై రవాణాశాఖ అధికారులు కేసులు పెట్టి వేలాది రూపాయల జరిమానాలు విధిస్తూ జీవనోపాధి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే జీవో 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీపీఐ నాయకుడు రావి కృష్ణ, ఆటో సంఘం నాయకులు కొల్లి శ్రీనివాసరావు, కె. గురుమూర్తి, మణి, రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదు


- విద్యార్థులు స్నేహభావం కలిగి ఉండాలి
- జిల్లా అదనపు న్యాయమూర్తి వాణిశ్రీ




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి వాణిశ్రీ

డాబాగార్డెన్స్ : విద్యార్థులు స్నేహ భావం కలిగి ఉండాలని, సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని జిల్లా అదనపు న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి వాణిశ్రీ పేర్కొన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ చట్టం 1997పై బుధవారం ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాణిశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం, న్యాయ వ్యవస్థపై గౌరవభావం కలిగి ఉండడం అవసరమన్నారు. జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేసే విధానం ఎన్నో ఏళ్ల నుంచి కళాశాల స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా చట్టం ఏర్పడిందని, ఈ చట్టానికి లోబడి ప్రతి పౌరుడు ఉండాల్సిందేనన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు పౌర సమాజంలో ఎన్నో మంచి మార్పులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యేసయ్య, ఆనంద్, వెంకటరత్నం, గాయత్రీ, వినీత ర్యాగింగ్ చట్టాలు, శిక్షలపై మాట్లాడారు. ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, ఆంధ్రా మెడికల్ కళాశాల ఫిజియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పీఎస్ఎన్ రాజు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవీలత, లీగల్ సెల్ అథారిటీ ప్యానెల్ న్యాయవాది కె. అప్పలనాయుడు, ఏవీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా వినాయక చవితి పూజ



మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న విశ్వనాథం

ఏయూ క్యాంపస్: పర్యావరణహిత జీవన విధానం ప్రతి ఒక్కరికి అవసరమని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య సర్వసిద్ధి హరనాథ్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూ సోషల్ వర్క్ విభాగంలో గ్రీన్ క్లైమేట్ సభ్యుల నేతృత్వంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మట్టి గణనాథుని ప్రతిమలను తయారు చేశారు. ఈ సందర్భంగా హరనాథ్ మాట్లాడుతూ ప్రకృతితో అనుసంధానమైన పండుగగా వినాయక చవితి నిలుస్తుందన్నారు. అనంతరం పెందుర్తి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కంచిపాటి విశ్వనాథం విద్యార్థులు, సిబ్బందికి మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఏయూ సోషల్ వర్క్ విభాగం, హెచ్ఆర్‌డీసీ, కెడీపీఎం పాఠశాల పెద్దవాల్తేరు, శివాజీపాలెం విద్యా సంస్థలో ఉపాధ్యాయులకు మట్టి వినాయక ప్రతిమలు అందజేశారు. గ్రీన్‌క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ ఈ ఏడాది 100 విద్యా సంస్థల్లో పంపిణీ లక్ష్యంగా పెట్టుకుని మట్టి వినాయక ప్రతిమలను తయారు చేస్తున్నామన్నారు. ఎకో వైజాగ్‌ను జయప్రదం చేద్దాం, మిషన్ లైఫ్‌ను ఆచరిద్దాం అని పిలుపునిచ్చారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో పాల్గొన్న ఏఎన్ఎం భారతి తదితరులు

అల్లిపురం : మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా వేంకటేశ్వరమెట్ట శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. టీకాలు వేయించని చిన్నారులకు గత మూడు రోజులుగా టీకాలు వేసే కార్యక్రమం చేపట్టినట్లు ఏఎన్ఎం భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు నాగజ్యోతి, లీలావతి పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



స్వామి వివేకానంద సేవా సంస్థలో చీరలు పంపిణీ చేస్తున్న ఏఎస్ఐ గోవిందమ్మ

జగదాంబ : పిల్లలు లేని లోటు తీరుస్తు అల్లారు ముద్దుగా పెంచుకున్న శునకం జ్ఞాపకార్థం స్వామి వివేకానంద సేవా సంస్థలో వృద్ధులకు ఒక దాత చీరలు పంపిణీ చేశారు. బుధవారం గోపాలపట్నం నేర విభాగానికి చెందిన ఏఎస్ఐ గోవిందమ్మ తన ఇంట్లో 16 ఏళ్లుగా ఓ శునకం (స్నోయి) పెంచుకుంటున్నారు. ఇటీవల ఆ శునకం మృతి చెందడంతో దాని పేరు మీద ఏఎస్ఐ గోవిందమ్మ స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో మహిళలకు చీరలతో పాటు అన్నదానం చేశారు.

రూపుదిద్దుకుంటున్న 108 అడుగుల భారీ గణనాథుడు



రూపొందుతున్న భారీ గణనాథుడు

సీతమ్మధార: వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో దొండపర్తిలోని రామాలయం వద్ద 108 అడుగుల భారీ గణనాథుడి విగ్రహం ఏర్పాటుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. మరో మూడు రోజుల్లో మొత్తం ఏర్పాట్లు పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఖర్గపూర్‌కు చెందిన కళాకారుడు శక్తిపాల్ బృందం ఈ భారీ వినాయకుడి విగ్రహాన్ని తయారు చేస్తోంది. గత ఏడాది 102 అడుగుల గణపతిని రూపొందించామని, ఈసారి 108 అడుగుల గణనాథుడిని ప్రతిష్ఠించనున్నట్లు సర్వేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 18 నుంచి 21 రోజుల పాటు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. తమ బృందం రూ.5 లక్షల సొంత నిధులతో ఈ భారీ గణపతిని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

వై.వి. సుబ్బారెడ్డికి ఆహ్వానం



వై.వి.సుబ్బారెడ్డికి ఆహ్వానం అందిస్తున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి, జాన్‌వెస్లీ

సీతమ్మధార : వై.ఎస్.జగన్ యువసేన ఆధ్వర్యంలో దొండపర్తిలో ఏర్పాటు చేసిన 108 అడుగుల వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్ పాల్గొన్నారు.